గౌడన్నలకు 'రక్షణ' ఏది?

కాటమయ్య కిట్ల కోసం గీత కార్మికుల ఎదురుచూపులు
- అరకొరగా పంపిణీ చేసిన ప్రభుత్వం
- ప్రమాదాలకు గురవుతున్న గౌడలు

టేకుమట్ల: గౌడ కులస్తులు నిత్యం ఉదయం, సాయంత్రం కుల వృత్తిలో భాగంగా తాటి చెట్లను ఎక్కుతూ తాటి కల్లును విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. సాహసంతో కూడుకున్న గీత కార్మికులు నిత్యం ప్రాణాలను అర చేతిలో పెట్టుకుని వృత్తిలో కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఎంతో మంది వృత్తిలో భాగంగా మృత్యువాత పడగా గాయాలతో బయటపడ్డ వారు సైతం ఉన్నారు. కాగా, గీత వృత్తిలో రక్షణ చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య కిట్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. కిట్లను తీసుకునే కార్మికులు ప్రభుత్వం అందించే శిక్షణకు హాజరై కిట్లను తీసుకోవాలి. కానీ కొన్ని గ్రామాల్లో రెండు నుంచి నాలుగు కిట్లను పంపిణీ చేసి, మరి కొన్ని గ్రామాల్లో పూర్తిగా అందించలేదు. దీంతో గీత కార్మికుల సంక్షేమం కోసం కాటమయ్య కిట్లను ప్రభుత్వం వెంటనే అందించాలని కోరుతున్నారు. కాటమయ్య కిట్ల వల్ల ప్రమాదాలను నివారించవచ్చని, తాటి చెట్లను క్షేమంగా ఎక్కి దిగే వీలుందని కావున గీత వృత్తిని కొనసాగిస్తున్న ప్రతి ఒక్కరికీ అందించాలని కార్మికులు కోరుతున్నారు.

వర్షాకాలంలో ప్రమాదాలు ఎక్కువ..
మూడు కాలాల్లో సైతం గీత కార్మికులు తప్పనిసరిగా తాటి చెట్టు ఎక్కాల్సిందే. వర్షాకాలంలో వర్షం కురిసిన సమయంలో చెట్టు జారే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కావున వర్షాకాలంలో కాటమయ్య కిట్లు ఎంతగానో ఉపయోగపడుతాయి. అంతే కాకుండా తాటి చెట్లు ఎక్కేటప్పుడు కానీ, దిగేటప్పుడు గానీ గీత కార్మికుడు అచేతన స్థితిలోకి మారినప్పుడు కాటమయ్య కిట్లు సహకరిస్తాయి.


తాటి చెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు

మండలంలో తాటి చెట్లపై నుంచి పడి పలువురు మృతి కొందరికీ తీవ్రగాయాలు అయ్యాయి. రాఘవరెడ్డిపేటలో తాటి చెట్టుపై నుంచి పడి గొల్లపల్లి కొమురయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. అలాగే వెల్లంపల్లిలో పంజాల రవి, పంజాల సంపత్, పంజాల రఘు మృతి చెందగా, గుమ్మడవెల్లిలో శ్రీపతి మొండయ్య, పంగిడిపల్లిలో తాళ్లపెల్లి రాజయ్య, ఆరెల్లి చంద్రమౌళి, వెలిశాలలో నేరేళ్ల శ్రీనివాస్, ఆరెల్లి రాజు, టేకుమట్లలో బొమ్మ మల్లయ్య మృతి చెందారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన ముంజాల రాజు, సమ్మయ్యగౌడ్, మామిండ్ల ఎల్లస్వామి, ఏరుకొండ రామస్వామి, మాదారపు నర్సయ్య, బొమ్మ సదాశివుడు, తదితరులు తీవ్ర గాయాలై ప్రాణాలతో బయటపడ్డారు.

చావు వరకు వెళ్లొచ్చా..



2010లో తాటి చెట్టు ఎక్కే క్రమంలో సుమారు 30 అడుగుల ఎత్తు నుంచి కింద పడిపోయా. చావు చివరి అంచుల వరకు వెళ్లొచ్చా. ఆస్పత్రిలో రూ.3లక్షల వరకు ఖర్చుతో బతికి బయటపడ్డాను. సంవత్సర కాలం పాటు విశ్రాంతి తీసుకుని కుటుంబ పోషణ కోసం మళ్లీ తాటి చెట్టు ఎక్కుతున్నా. ప్రాణాలతో చెలగాటం లాంటి గీత వృత్తికి ప్రభుత్వం కాటమయ్య కిట్లను అందించాలి.

- మామిండ్ల ఎల్లస్వామి, గీత కార్మికుడు, టేకుమట్ల

నాన్నను కోల్పోయా..



గీతవృత్తిలో భాగంగా మా నాన్న 2012 తాటి చెట్టుపై నుంచి పడి మృతి చెందాడు. నాన్నను కోల్పోయిన నాటి నుంచి కుటుంబ భారం నాపైనే ఉంది. గతంలో రక్షణ చర్యలు తీసుకుంటే బతికేవాడేమో. ఇప్పుడు గీత కార్మికులకు కాటమయ్య కిట్ల పంపిణీ ఆనందమే కానీ కార్మికులందరికీ అందించాలి. కుల వృత్తిపై ఆధారపడిన వారందరికి సహకరిస్తుంది.

- ఆరెల్లి శేఖర్, పంగిడిపల్లి

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిట్యాల: చిట్యాల సబ్‌స్టేషన్ పరిధిలో నేడు (బుధవారం) ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిట్యాల 11కేవీ లైన్ కింద చెట్లను తొలగించేందుకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



భూపాలపల్లి అర్బన్: జస్ట్ ఫర్ చిల్డ్రన్స్ సహయ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎన్‌జీఓ) ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. మండలంలోని కమలాపూర్, నాగారం, రాంపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులకు బాలకార్మికులు, బాల్య వివాహాల నివారణ, చర్యలపై అవగాహన కల్పించినట్లు ఎన్‌జీఓ ప్రతినిధి సామల శ్రీలత తెలిపారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు.

గిన్నీస్‌బుక్‌లో చోటు



మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల పంచాయతీ అధికారి యు.సుభాష్ చంద్రబోస్ గిన్నీస్ బుక్‌లో చోటు సంపాదించారు. ప్రపంచస్థాయిలో జరిగిన మ్యూజిక్ ప్రదర్శనలో హలేల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా కీబోర్డు వాయిస్తున్న సంగీత కళాకారుల బృందం గత సంవత్సరం డిసెంబర్ 01న గంటలో 1046 వీడియోలు అప్లోడ్ చేయడంతో ఈ ఘనత సాధించారు. కాగా మంగళవారం హైదరాబాద్‌లో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధుల సమక్షంలో మెడల్, సర్టిఫికెట్ అందుకున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


రాజయ్య (ఫైల్)

రేగొండ : గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన కొత్తపల్లిగోరి మండలంలోని జగ్గయ్యపేటలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలప్రకారం.. జగ్గయ్యపేటకు చెందిన బుల్లవేణి రాజయ్య (53) భార్య విమల ఐదేళ్ల క్రితం మృతి చెందింది. కాగా, మానసికంగా ఇబ్బంది పడుతున్న రాజయ్య మద్యానికి బానిసయ్యాడు. భార్య లేని జీవితం ఎందుకని జీవితంపై విరక్తి చెంది ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ కుమార్ పేర్కొన్నారు.

మిషన్ భగీరథ నీరు అందిస్తాం..

సాక్షి ఎఫెక్ట్..

చిట్యాల: మండలంలోని బావుసింగ్‌పల్లి ఎస్సీ కాలనీలో మిషన్ భగీరథ నీరు రాక రెండేళ్లు అవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని 'సాక్షి'లో మంగళవారం భగీరథ.. తీరని వ్యథ అనే కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలోని ఎస్సీ కాలనీ సందర్శించారు. భగీరథ పైపులైన్ గతంలో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకపోయిందని మళ్లీ ప్రతిపాదన పంపించి త్వరతగతిన భగీరథ నీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గీత తెలిపారు. అలాగే కాలనీలో మురుగు కాలువలు, చెత్తాచెదారాన్ని పరిశుభ్రంగా చేయించడం జరిగిందని ఎంపీఓ రామకృష్ణ పేర్కొన్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి సరిత, జీపీ సిబ్బంది ఉన్నారు.


ఎస్సీ కాలనీలో సందర్శిస్తున్న అధికారులు

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత


సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఎస్సైలు అభినవ్, శ్రీనివాస్

కాటారం: మండల కేంద్రానికి చెందిన కీసరి నారాయణ, ఆత్కూరి వెంకటస్వామి, కొత్తపల్లి గ్రామానికి చెందిన హట్కర్ ధూంసింగ్, హనుమకొండకు చెందిన శర్మ, మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన గణేశ్, నస్తూర్‌పల్లికి చెందిన మహేశ్ ఇటీవల మండల పరిధిలో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసిన పోలీసులు సెల్‌ఫోన్లను రికవరీ చేశారు. దీంతో బాధితులకు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై అభినవ్, ఎస్సై-2 శ్రీనివాస్ చేతుల మీదుగా సెల్‌ఫోన్లను అప్పగించారు.

'యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దు'


స్థానికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వెంకటాపురం(కె) : యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారి వారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని వెంకటాపురం సెకండ్ ఎస్సై నర్సింహస్వామి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు, గ్రామస్తులకు డ్రగ్స్, పోక్సో చట్టం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు బానిసలైతే వారి బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని సూచించారు. గ్రామాల్లో ఎక్కడైన డ్రగ్స్ అమ్మిన, కొనుగోలు చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మంచి మార్గంలో నడువాని సూచించారు. సీఆర్‌పీఎఫ్,సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

- ఐదుగురిపై కేసు నమోదు

ములుగు రూరల్ : ములుగు మండలంలోని రామ్‌నగర్ తండాలో అక్రమంగా నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై మంగళవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ మేరకు ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రామ్‌నగర్‌తండా శివారులో నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు వెల్లడించారు. కాగా 400 లీటర్ల బెల్లం పానకం, 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గుడుంబా తయారు చేసిన అజ్మీరా దశరథం, లావుడియా వినోద్‌కుమార్, లావుడియా భగవాన్‌సింగ్, అజ్మీరా సునీల్, పాల్తీయ తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ నిషేధిత గుడుంబాను తయారు చేసినా, విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో రెండో ఎస్సై లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి

ఏటూరునాగారం : మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలని సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై తాజొద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఉచితంగా జూట్ బ్యాగ్‌ల శిక్షణ కేంద్రాన్ని వారు సందర్శించి మహిళలకు పలు సూచనలు చేశారు. ఇంటి వద్దనే ఉంటూ స్వయంగా ఎదగడానికి ఈ జూట్ బ్యాగ్‌ల తయారీ ఎంతగానో ఉపయోగపడు తుందన్నారు. ఎవరిపై ఆధారపడకుండా ఆర్థికంగా ఎదగడానికి ఇది చక్కటి అవకాశం అన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకొని జూట్ బ్యాగ్‌ల తయారీ పరిశ్రమను మహిళలు అంతా కలిసి ఏర్పాటు చేసుకోవాలని ఆయన కోరారు. సాయిబాబా ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కాటారం: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న అధికారులు


భూపాలపల్లి అర్బన్: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

- ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక

కాటారం : గర్భిణులు, బాలింతలు పోషకాలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ రాధిక పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అయ్యప్ప ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పోషకాహారం, రక్తహీనత, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. పోషకాహార పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. గర్భిణులకు సీమంతం, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన, మూడు సంవత్సరాల పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. స్థానికంగా లభించే కూరగాయలు, ఆకు కూరలు, చిరుధాన్యాల్లో అనేక పోషకాలు ఉంటాయన్నారు. వీటిని సక్రమంగా ఉపయోగించుకోని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఐరన్, కాల్షియం మాత్రలను వినియోగించాలని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం, కోడిగుడ్లు అందజేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ మౌనిక, ఎంపీఓ వీరస్వామి, ఎన్‌జీఓ కో ఆర్డినేటర్ సమ్మయ్య, పోషణ్ అభియాన్ కో ఆర్డినేటర్ స్వప్న, సూపర్‌వైజర్లు వీణ, శివరాణి, కాటారం, గంగారం క్లస్టర్ల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు, ఆయాలు పాల్గొన్నారు.


మొగుళ్లపల్లిలో..

పోషకాహారాన్ని తీసుకోవాలి
భూపాలపల్లి అర్బన్ : గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తప్పక తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రజిత సూచించారు. పట్టణంలోని శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ రజిత హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారం పిల్లలు, తల్లులు, గర్భిణులకు అందించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు తీసుకువచ్చిన పోషక ఆహార పదార్థాలను వారికి చూపించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, పుష్పలత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి సెక్టార్ పరిధిలోని నర్సింగాపూర్, పర్లపల్లి సెక్టార్ పరిధిలోని ముల్కలపల్లి గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి, రజిత ఆధ్వర్యంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారపు అలవాట్లు, పోషకాహార ప్రాధాన్యత, పలు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అంగన్‌వా డీ టీచర్లు వాణి, రమ, రాధిక, స్వరూప పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల పలుగులలోని అంగన్‌వాడీ-2లో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని టీచర్ ఒద్ది ఉమామహేశ్వరీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గర్భిణులు, తల్లులకు ఆహార నియమాలపై అవగాహన కల్పించారు.

ఎంపీడీఓ సేవలు మరువలేనివి


మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సునీత

మొగుళ్లపల్లి: మండలంలో పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన ఎంపీడీఓ మహమ్మద్ మహబూబ్ హుస్సేన్ సేవలు మరువలేనివని మండల ప్రత్యేకాధికారి సునీత, తహసీల్దార్ సునీత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుభాష్‌చంద్రబోస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాపసభకు వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభకు హాజరైన అధికారులు, కార్యాలయ సిబ్బందితో కలిసి ఎంపీడీఓ హుస్సేన్ మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అశోక్, ఎంఈఓ కుమారస్వామి, మండల వైద్యాధికారి నాగరాణి, ఆర్ఐ శివరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రేగొండ: మండలంలోని రాయపల్లి గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు నీటూరి శ్రీనివాసరావు తల్లి నీలమ్మ విద్యుదాఘాతంతో ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి పరామర్శించారు. ఆమె వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిశిధర్‌రెడ్డి, నాయకులు దాసరి తిరుపతిరెడ్డి, శోభన్, సమ్మయ్య, కిషన్, గణేష్, రాకేశ్‌రెడ్డి ఉన్నారు.


రేగొండ: పరామర్శిస్తున్న కీర్తిరెడ్డి

టేకుమట్లలో..
టేకుమట్ల: మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మారం లింగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మోతె రాజమౌళి, లింగారెడ్డి, రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రతీ రైతుకు పరిహారం చెల్లించాలి

ములుగు/ఏటూరునాగారం : వడగండ్ల వర్షానికి పంటలు నష్టపోయిన ప్రతీ రైతుకు నష్టపరిహారం అందించాలని కలెక్టర్ దివాకర్‌కు బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మీనర్సింహారావు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని మంగపేట, ఏటురునాగారం మండలాల పరిధిలో కురిసిన వడగండ్ల వర్షానికి, ఈదురుగాలులకు సుమారు మూడు వేల ఎకరాల్లో వరి పంట కింద పడిపోయి వడ్లు రాలిపోయి నష్టపోయినట్లు ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. రైతులు, కౌలు రైతులు పట్టా లేని రైతులు భూమి ఎక్కువ ఉండి పట్టాలో తక్కువ ఉన్న రైతులు కూడా ఉన్నారని ఫీల్డ్ లో చూసి వారికి కూడా నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు, గోవింద్‌నాయక్ ఉన్నారు.

పునాది దశలో ఇందిరమ్మ ఇళ్లు

ముందుకు సాగని మోడల్ హౌస్ పనులు
- పైలట్ గ్రామానికి 75 ఇళ్లు మంజూరు
- బేస్‌మెంట్ లెవల్‌లో 22 గృహాలు
- పర్యవేక్షణ చేయని అధికారులు

వెంకటాపురం (కె) : అట్టహాసంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆదిలోనే అడ్డంకులు ఎదురవుతున్నాయి.. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. కాగా ఈ పథకం ఆచరణలో మాత్రం ఆలస్యమవుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మండల పరిధిలోని రాచపల్లి గ్రామ పంచాయతీని పైలట్ పంచాయతీగా ఎంపిక చేసి 75 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. కాగా నెల రోజుల క్రితం 63 ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోశారు. మండల పరిషత్‌కార్యాలయంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులకు చూపించేందుకు నిర్మిస్తున్న మోడల్ హౌస్ సైతం బేస్‌మెంట్ లెవల్ లోనే నిలిచిపోయి పనులు ముందుకు సాగడం లేదు.

నత్తనడకన 'నమూనా ఇళ్లు'
స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ నమూనా ఇళ్లు (మోడల్ హౌస్) నిర్మాణానికి అధికారులు గతంలో ముగ్గు పోశారు. కాగా నమూనా ఇంటికి ముగ్గు పోసిన నెలకు గుంతలు తీసి వదిలేశారు. కాగా రెండు నెలలు పూర్తి కావొస్తున్న నమూనా ఇంటి నిర్మాణ పనులు పునాది దశలోనే ఆగిపోయింది. నమూనా ఇంటి నిర్మాణ పనులే నత్తనడకన సాగుతుంటే మోడల్ పంచాయతీలో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులు అధికారులు ఎలా వేగవంతం చేస్తారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


బేస్‌మెంట్ లెవల్‌లోనే ఆగిన మోడల్ హౌస్ నిర్మాణ పనులు

రాచపల్లికి 75 ఇళ్లు మంజూరు

మోడల్ పంచాయతీగా ఎంపిక చేసిన రాచపల్లి గ్రామ పంచాయతీలో 75 ఇళ్లను అధికారులు మంజూరు చేశారు. కాగా 65 ఇళ్ల నిర్మాణ పనులకు మార్చి 15వ తేదీన ముగ్గు పోశారు. ముగ్గు పోసిన రోజులు గడుస్తున్నప్పటికీ 44 ఇళ్లు ఇంకా గుంతల దశలో ఉన్నాయి. 22 ఇళ్లు బేస్‌మెంట్‌లెవల్‌కు చేరుకున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం..



మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 75 ఇళ్లు మంజూరు కాగా 65 ఇళ్లకు ముగ్గులు పోశాం. 44 ఇళ్లు గుంతల దశలో, 22 పునాది దశలో ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ గృహ నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే ఇళ్లన్ని పూర్తవుతాయి.

- రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ

ఆట వస్తువుల పంపిణీ



వెంకటాపురం(కె) : మండల పరిధిలోని నూగూరు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆట వస్తువులను అందజేశారు. ఆ సంస్థ డైరెక్టర్ లూర్ధు రాజు ఆదేశాల మేరకు మండల కోఆర్డినేటర్ గొంది హనుమంతు అంగన్‌వాడీ టీచర్‌కు ఆట వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ యూనిమేటర్ ఉషారాణి తదితరులు ఉన్నారు.